సాక్షి నిర్మల్

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



కొనసాగుతున్న మల్లన్న జాతర

ముధోల్ మండలం ఎడ్‌బిడ్ గ్రామంలో రెండు రోజులుగా సాగుతున్న మల్లన్న జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. సోమవారం కుస్తీ పోటీలు నిర్వహించారు. 8లో▸



ఆర్టీసీకి కలిసొచ్చిన జాతర

మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఆర్టీసీకి కలిసొచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రీజియన్ పరిధిలోని అన్ని డిపోలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాయి. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.2 /22.4

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. పగలు వేడి, ఉక్కపోత పెరుగుతుంది. రాత్రి చలి ప్రభావం తగ్గుతుంది.

న్యూస్‌రీల్

ఆస్పత్రుల తనిఖీ

- డయాగ్నోస్టిక్ సెంటర్లు కూడా..
- 'దుకాణాల్లా.. దవాఖానాలు' కథనంతో అధికారుల్లో కదలిక



వైద్యురాలి సర్టిఫికెట్లు పరిశీలిస్తూ..

సాక్షి స్పందన

నిర్మల్: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేటు ఆస్పత్రుల తీరుపై 'దుకాణాల్లా..దవాఖానాలు' శీర్షికన 'సాక్షి' జిల్లా పేజీలో సోమవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని వైద్య శాఖ రాష్ట్ర అధికారులతోపాటు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. డీఎంహెచ్‌వో ధనరాజ్ సూచన మేరకు డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్, సిబ్బంది జిల్లాకేంద్రంలోని పలు ఆస్పత్రులతోపాటు డయాగ్నోస్టిక్ కేంద్రాలను తనిఖీ చేశారు. బస్టాండ్ పక్కన సందులో ఏర్పాటు చేస్తున్న కొత్తగా మల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి వెళ్లారు. అనుమతులు లేకుండా ఇష్టారీతిన ఆస్పత్రి పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంచిర్యాల రోడ్డులో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రి అనుమతులు, వైద్యురాలి పత్రాలనూ సరిచూశారు.

నిబంధనల మేరకు ఉండాలి..

వైద్యశాఖ నిబంధనలను ప్రైవేటు ఆస్పత్రులు పక్కాగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్ సూచించారు. ఆస్పత్రులను పరిశీలించిన తర్వాత ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు చేశామన్నారు. అనుమతులు తీసుకోవడంతోపాటు అర్హులైన వైద్యులు ఉండాలని చెప్పామన్నారు. లేనిపక్షంలో ఆస్పత్రులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలను వారంపాటు జిల్లాలో కొనసాగిస్తామని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు జిల్లా విద్యార్థులు

నిర్మల్ రూరల్: గత విద్యా సంవత్సరానికి జిల్లాకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ అవార్డులకు ఎంపికై నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. 119 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వీరిలో పది మంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు వెల్లడించారు. ఆత్రం శ్రీకాంత్ (జెడ్పీఎస్ఎస్, స్వర్ణ), గోలి రాజ్‌కృష్ణ శ్రేయస్(విన్నర్స్ హై స్కూల్, నిర్మల్), మగ్గిడి అన్వేష్(జెడ్పీహెచ్ఎస్, మస్కాపూర్), షేక్ శాబాద్, (యూపీఎస్ సరస్వతి శిశు మందిర్ ముధోల్), తోట దివ్య (జెడ్పీహెచ్ఎస్ చించోలి,ఎమ్), షేక్ అవెజ్ (జెడ్పీహెచ్ఎస్ పాక్‌పట్ల), వేంపల్లి స్పందన (జెడ్పీహెచ్ఎస్ పిప్రి), ప్రేమ స్పందన(రవీంద్ర హైస్కూల్ ముధోల్), ఆకుల విష్ణు ష్(గవర్నమెంట్ హైస్కూల్, జుమ్మా రాత్‌పేట్ నిర్మల్), మన్య మనోజ్(సెయింట్ థామస్‌స్కూల్ దిలావర్‌పూర్) ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను, గైడ్ టీచర్లను డీఈవో అభినందించారు. అదేవిధంగా ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను జిల్లాస్థాయికి 125 ప్రాజెక్టులు ఎంపికయ్యాయని తెలిపారు. ప్రతీ విద్యార్థికి వారి బ్యాంకు ఖాతాలో రూ.10 వేలు ప్రభుత్వం డిపాజిట్ చేస్తుందన్నారు.

లింగనిర్ధారణ నేరం

నిర్మల్‌చైన్‌గేట్: లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని, భ్రూణ హత్యలు నివారించి ఆడపిల్లను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లా అడ్వైజరీ కమిటీ (పీసీ అండ్ పీఎన్డీటీ యాక్ట్ 1994) సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పుట్టబోయే బిడ్డ ఎవరనేది తెలుసుకోవడానికి, లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్ రజిని, అడ్వకేట్, సామాజిక కార్యకర్త నిర్మల, జిల్లా పౌరసంబంధాల అధికారి విష్ణువర్ధన్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి రవీందర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో విచారణ..?

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో ఇద్దరు విద్యార్థులు హాస్టల్ భవనంపై సిగరెట్ తాగుతూ పట్టుబడినట్లు సమాచారం. ఈ విషయంపై ఐదుగురు సభ్యుల బృందం విచారణ చేస్తోందని తెలుస్తోంది. పట్టుబడిన విద్యార్థులు గంజాయి వంటి మత్తు పదార్థాలు కలిపి సిగరెట్లు సేవిస్తున్నారా..? అన్న కోణంలోనే విచారణ చేస్తున్నట్లు తెలిసింది. గతేడాది గంజాయి తాగుతూ విద్యార్థులు పట్టుబడిన విషయం తెలిసిందే. అప్పుడు మహారాష్ట్ర నుంచి క్యాంపస్‌లోకి గంజాయి వచ్చినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలోనే విచారణ చేస్తున్నారని సమాచారం. ప్రస్తుత విచారణ నేపథ్యంపై క్యాంపస్ అధికారులను సంప్రదించినా ఎవరూ అందుబాటులోకి రాలేదు.

పసుపు రైతుకు అకాల నష్టం



తడిసిన పసుపును ఆరబెడుతున్న రైతు

అకాల వర్షం దిలావర్‌పూర్ మండలంలోని పసుపు రైతులకు నష్టం మిగిల్చింది. ఆదివారం రాత్రి దిలావర్‌పూర్, సిర్గాపూర్, గుండంపల్లి, బన్సపల్లి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి రైతులు ఉడకబెట్టి ఆరబెట్టిన పసుపు తడిసి ముద్దయింది. రాత్రి వేళ వర్షం కురవడంతో రైతులు పంటను కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. చాలావరకు పసుపు తడిసింది. ఇప్పటికే తెగుళ్ల కారణంగా దిగుబడి తగ్గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టం కలిగించింది. తడిసిన పంట రంగు మారుతుందని, గిట్టుబాటు రాదని రైతులు పేర్కొంటున్నారు. మొక్కజొన్న, నువ్వు పంటలు కూడా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - దిలావర్‌పూర్

నిధులొచ్చి ఏం లాభం?



దస్తురాబాద్ కేజీబీవీ

- ఎస్‌ఎంసీల రద్దు.. పీఎంశ్రీకి ఆటంకం
- నిధులు వినియోగించలేని పరిస్థితి
- సంశయంలో ప్రధానోపాధ్యాయులు

నిర్మల్‌రూరల్: జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన బడుల పరిస్థితి 'అన్నీ ఉన్నా.. అల్లుడినోట్లో శని' అన్నచందంగా తయారైంది. ప్రభుత్వం ఇటీవలే నిధులు విడుదల చేసింది. బడుల బాగోగులు, అభివృద్ధి కోసం వీటిని ఖర్చు చేయాల్సి ఉంటుంది. కానీ బ్యాంకు నుంచి నిధులు తీసుకోవడానికి ఎస్‌ఎంసీ పాలకవర్గం అనుమతి తప్పనిసరి కావడంతో ప్రధానోపాధ్యాయులు ఇరకాటంలో పడ్డారు. డిసెంబర్ 31తో పాఠశాలల్లో ఎస్‌ఎంసీల పదవీకాలం ముగిసింది. కొత్తగా ఎన్నికల కోసం ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ జారీ చేసినా విద్యా సంవత్సరం మధ్యలో చదువులకు ఇబ్బంది కలుగుతుందని ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకించడంతో ఎన్నికలను జూన్‌కు వాయిదా వేసింది.

17 పాఠశాలలకు పీఎంశ్రీ..

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి జిల్లాలో 17 పాఠశాలలను ఎంపిక చేశారు. 2023–24 విద్యా సంవత్సరానికి 12 పాఠశాలలకు(విద్యార్థుల సంఖ్య 250 కన్నా ఎక్కువగా ఉన్న పాఠశాలలు) రూ.99,939 చొప్పున రూ.11,99,268, మరో 5 పాఠశాలలకు రూ.75 వేల చొప్పున(విద్యార్థుల సంఖ్య 250 కన్నా తక్కువగా ఉన్న పాఠశాలలు) రూ.3,75,000 నిధులు ప్రభుత్వం 20 రోజుల క్రితం మంజూరు చేసింది. ఈ పాఠశాలల్లో ల్యాబ్‌లతోపాటు విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వృత్తివిద్యా కోర్సులు అందించనున్నారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు, ప్రయోగశాల, డిజిటల్ గ్రంథాలయం, ఇంటర్నెట్ కనెక్షన్, గార్డెనింగ్, ఆటస్థలం, సమ్మర్ క్యాంపు నిర్వహణ, స్వచ్ఛభారత్, కరెంటు బిల్లుల చెల్లింపు, క్రీడా సామగ్రి, సౌర విద్యుత్ ప్యానెల్ ఏర్పాటు చేయడం, ప్లాస్టిక్ రహితంగా మార్చడం, నాణ్యమైన విద్య అమలుకు చర్యలు తీసుకుంటారు. సాధారణంగా బడులకు నిర్వహణ నిధులను రెండు దశల్లో ప్రభుత్వం విడుదల చేస్తుంది. కానీ పీఎంశ్రీ బడులకు మాత్రం ఆలస్యంగానైనా ఈసారి ఒకే దశలో వంద శాతం నిధులు విడుదల చేయడం గమనార్హం.



జిల్లా కేంద్రంలోని జుమ్మరాత్‌పేట్ పాఠశాల

ఎంపికైన బడులు ఇవే

పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో 17 బడులను ఎంపిక చేశారు. జెడ్పీహెచ్ఎస్ బాసర, జెడ్పీహెచ్ఎస్ దేగాం, ఓవైసీ నగర్ ఆశ్రమ పాఠశాల భైంసా, కేజీబీవీ దస్తురాబాద్, జెడ్పీహెచ్ఎస్ దిలావర్‌పూర్, నచ్చన్‌ఎల్లాపూర్ సోషల్ వెల్ఫేర్ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ మస్కాపూర్, కుభీర్ ఆశ్రమ పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ లక్ష్మణచాంద, టీఎస్ఎంఎస్ కుంటాల, జెడ్పీహెచ్ఎస్ కొర్టికల్, సోషల్ వెల్ఫేర్ బాలుర పాఠశాల ముధోల్, ఆశ్రమ పాఠశాల ఈద్‌గాం, జుమ్మేరాత్‌పేట్ ఉన్నత పాఠశాల నిర్మల్, బాలికల ఆశ్రమ పాఠశాల జామ్, లెఫ్ట్ పోచంపాడు సోషల్ వెల్ఫేర్ ఉన్నత పాఠశాల, జెడ్పీహెచ్ఎస్ తానూర్‌ను ఎంపిక చేశారు. ఈ బడులకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా కేంద్రం నిధులు విడుదల చేసింది.

రెండు, మూడు రోజుల్లో స్పష్టత



పీఎంశ్రీ బడులకు నిర్వహణ నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. వినియోగంపై నెలకొన్న సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనికి సంబంధించి రెండు, మూడు రోజుల్లో ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది. - రవీందర్‌రెడ్డి, డీఈవో

ఎస్‌ఎంసీల రద్దుతో..

పీఎంశ్రీ బడుల ఖాతాల్లో నిధులు ఉన్నా, వాటిని విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం లేకపోవడంతో ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నిధుల్ని పాఠశాల కమిటీ సమక్షంలోనే ఖర్చు చేయాలనే నిబంధన ఉండడంతో ఇరకాటంలో పడ్డారు. పాత ఎస్‌ఎంసీలను ప్రభుత్వం ఇటీవలే రద్దు చేసింది. నూతన విద్యా కమిటీల ఎన్నికలను సైతం వచ్చే విద్యా సంవత్సరం నాటికి వాయిదా వేసింది. ఈ విద్యా సంవత్సరం ఏప్రిల్ 23తో ముగియనుంది. ఇప్పటికే నిధులు ఆలస్యంగా మంజూరయ్యాయి. అప్పులు, చేబదులు తెచ్చి ఇప్పటికైతే ఎలాగోలా నెట్టుకొచ్చారు. నిధులు మంజూరైనట్లు ఉత్తర్వులు రావడంతో హర్షం వ్యక్తమైనా ఈ నిధుల్ని బయటకు తెచ్చే మార్గం లేక తలలు పట్టుకుంటున్నారు. సెల్ఫ్ డిఫెన్స్ ప్రోగ్రామ్ కింద జిల్లాలోని 14 పాఠశాలలకు రూ.3.45 లక్షలు విడుదలయ్యాయి. ఇందులో తొమ్మిది పాఠశాలలకు రూ.30 వేల చొప్పున, ఐదు పాఠశాలలకు రూ.15 వేల చొప్పున ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులను ఆయా పాఠశాలల్లో వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులకు కూడా ఎస్‌ఎంసీ కోరిఉండడంతో వినియోగంపై స్పష్టత లేదు. ప్రస్తుతం వీటిని ఎలా వినియోగించుకోవాలో సంశయంలో పడ్డారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- పకడ్బందీగా నిర్వహిస్తాం..
- డీఐఈవో పరశురాం



డీఐఈవో పరశురాం

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు జిల్లాలో ఏర్పాట్లు చేసినట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే సెకండియర్ విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు పూర్తయ్యాయి. ప్రథమ, ద్వితీయ వొకేషనల్ పరీక్షలు ఈనెల 28 నుంచి ప్రారంభమవుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో పరీక్షల ఏర్పాట్లు నిర్వహణపై డీఐఈవో 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

సాక్షి: జిల్లాలో ఎన్ని పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు? ఎంతమంది పరీక్ష రాయనున్నారు?

డీఐఈవో: జిల్లాలో మొత్తం 23 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశాం. మొత్తం 13,345 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఇందులో ఫస్టియర్ రెగ్యులర్ విద్యార్థులు 5,463 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,072 మంది, సెకండ్ ఇయర్ రెగ్యులర్ విద్యార్థులు 5,772, ఒకేషనల్ విద్యార్థులు 1,038 మంది ఉన్నారు.

సాక్షి: పరీక్షల నిబంధనలు ఏమిటి?

డీఐఈవో: విద్యార్థులు పరీక్ష కేంద్రానికి నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతించేది లేదు. అరగంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

సాక్షి: పరీక్ష కేంద్రాల్లో వసతులు ఎలా ఉన్నాయి?

డీఐఈవో: పరీక్ష కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాం. ప్రత్యేకంగా తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతాం. పరీక్షా కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లు ఎట్టి పరిస్థితిలో అనుమతించేది లేదు.

సాక్షి: ఎంత మంది అధికారులు పరీక్షల విధులు నిర్వహిస్తారు?

డీఐఈవో: పరీక్షల నిర్వహణ కోసం ముగ్గురు జిల్లాస్థాయి అధికారులను నియమించాం. ఇందులో ఒకరు డీఐఈవో, మరొకరు సీనియర్ ప్రిన్సిపాల్, మరొకరు సీనియర్ లెక్చరర్ ఉంటారు. మూడు ఫ్లైయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, 23 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 20 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను కేటాయించాం.

సాక్షి: మాస్ కాపీయింగ్‌ను ఎలా నివారిస్తారు?

డీఐఈవో: పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ప్రైవేటు కళాశాలలపై ప్రత్యేక నిఘా ఉంటుంది. అనుమానం ఉన్న ప్రతీ కేంద్రాన్ని ప్రత్యేకంగా తనిఖీ చేస్తాం. పరీక్షల నిర్వహణ విధుల్లో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, ముగ్గురు డీఈసీ సభ్యులు, హైపవర్ కమిటీ సభ్యులు పాల్గొంటారు.

సాక్షి: ప్రైవేటు కళాశాలల ఫీజుల ఒత్తిడి, హాల్ టికెట్ల జారీపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

డీఐఈవో: విద్యార్థులపై ప్రైవేట్ కళాశాల ఫీజుల ఒత్తిడి, హాల్ టికెట్లు ఇవ్వని కళాశాలపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వారికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. విద్యార్థులందరూ ఆన్‌లైన్‌లో కూడా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరు కావొచ్చు.

సాక్షి: విద్యార్థుల్లో ఒత్తిడి తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో: విద్యార్థులు ఒత్తిడికిలోను కాకుండా మానసికంగా కుంగిపోకుండా తల్లిదండ్రులు, అధ్యాపకులు ధైర్యం చెప్పాలి. పరీక్షలపై భయాన్ని తొలగించేందుకు మానసిక వైద్య నిపుణుల సేవలు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు వినియోగించుకునేలా ఇంటర్మీడియెట్ బోర్డు చర్యలు చేపట్టింది. ఎవరైనా పరీక్షల విషయంలో ఆందోళనకు గురైతే 14416 లేదా 1800914416 టోల్‌ఫ్రీ నంబర్లలో సంప్రదించాలి.

సాక్షి: ఉత్తీర్ణత శాతం పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

డీఐఈవో: ఈ సంవత్సరం ఉత్తీర్ణత శాతం పెరగడానికి ముందస్తు చర్యలు తీసుకున్నాం. పక్కా ప్రణాళికతో విద్యాబోధన కొనసాగించాం. రెగ్యులర్‌గా తరగతులు నిర్వహించి, సరైన సమయానికి సిలబస్ పూర్తి చేశాం. ప్రత్యేక తరగతులు చేపట్టాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించి ప్రత్యేక విద్యాబోధన చేయించాం.

బాసర స్టేషన్‌కు మంచి రోజులు

- 'అమృత్' పనులకు శంకుస్థాపన
- వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

భైంసా: రానున్న రోజుల్లో దేశం మరింత అభివృద్ధి సాధిస్తుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. అమృత్ భారత్‌లో భాగంగా బాసర రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. బాసర స్టేషన్‌ను రూ.11.33 కోట్లతో అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించారు. 2014–15లో తెలంగాణకు రైల్వే బడ్జెట్‌లో రూ.250 కోట్లు కేటాయిస్తే 2024–25లో రూ.5,070 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. గడిచిన పదేళ్లకాలంలో రైల్వే బడ్జెట్ 20 రేట్లు పెరిగిందని పేర్కొన్నారు.

మోదీ పాలనలో దేశం పురోగతి...

ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో దేశం అన్నిరంగాల్లో పురోగతి సాధించిందని ఆదిలాబాద్ ఎంపీ సోయంబాపురావు అన్నారు. దేశ ప్రధాని నిరంతరాయంగా పనిచేస్తూ భారత కీర్తిని ప్రపంచానికి చాటుతున్నారని పేర్కొన్నారు. అన్నివర్గాల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందని తెలిపారు.



కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే, నాయకులు

మారనున్న రైల్వేస్టేషన్ రూపురేఖలు..

అమృత్‌భారత్ స్కీంలో భాగంగా బాసర రైల్వేస్టేషన్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. రైల్వే మార్గాన్ని మరింత సులభతరంచేసేలా అమృత్‌భారత్‌లో భాగంగా బాసర స్టేషన్‌ను ఆధునికీకరిస్తుందని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం బాసర సికింద్రాబాద్ మధ్య మరిన్ని రైళ్లు నడిపాలని కేంద్రాన్ని కోరుతామని చెప్పారు. కార్యక్రమంలో సెంట్రల్ రైల్వే బోర్డ్ సివిల్ ఇంజినీర్ సచిన్, డీఎంవో కవిత, మాజీ మున్సిపల్ చైర్మన్ గంగాధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల 'వాణి'పై స్పందించాలి

- అర్జీల పరిష్కారంలో జాప్యం చేయొద్దు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి ప్రజలు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వస్తారని, వారి సమస్యలపై సత్వరం స్పందించాలని, పరిష్కారంలో జాప్యం చేయొద్దని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వయంగా స్వీకరించారు. సమస్యలను ఓపికగా విన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ఇప్పటి వరకు శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న అర్జీలపై చర్చించారు. వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల ఆస్తి పన్నుల బకాయిలు వెంటనే చెల్లించాలని సూచించారు. ఈనెల 28 నుంచి జరగనున్న ఇంటర్మీడియెట్ పరీక్షలను అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు. వ్యవసాయ, ధరణి, పింఛన్లు, భూసంబంధిత సమస్యలపై 39 అర్జీలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో గంగయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు అడ్డంకులు తొలగించాలి

భైంసా పట్టణంలోని 7వ వార్డు డబ్బా గల్లీ, రాహుల్‌నగర్, బుద్ధవిహార్ కాలనీలలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు లేవు. మున్సిపల్ వైస్ చైర్మన్, కమిషనర్ పనులు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. పనులు చేసేలా ఆదేశించండి. - అనిత బాలాజీ, కౌన్సిలర్, భైంసా

బయానా తీసుకుని ఇల్లు అమ్మడం లేదు

సారంగాపూర్ మండలం బోరిగామ గ్రామంలో నాకు 3–28 నంబర్ మీద సొంత ఇల్లు ఉంది. ఇదే గ్రామానికి చెందిన రవీందర్‌సింగ్ నా ఇంటి పక్క నే ఉంటారు. రవీందర్ సింగ్‌కు సంబంధించి నా స్థలాన్ని గ్రామ పెద్దల సమక్షంలో రూ. 6,80,000 లకు కొనుగోలు చేశాను. బయానా రూ.50 వేలు చెల్లించాను. గ్రామ పెద్దల నిర్ణయం ప్రకారం మిగతా సొమ్ము చెల్లిస్తానని ఒప్పందం చేసుకున్నాను. ఇప్పుడు రవీందర్‌సింగ్ ఆ ఇల్లు అమ్మడం లేదు. న్యాయం చేయండి. - పల్లికొండ బుచ్చన్న, బోరిగం

డిజిటల్ పాస్‌బుక్‌లో పేరు సరిచేయాలి



2007, అక్టోబర్ 29న అప్పటి ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి ఫైల్ నంబర్ ఆ/3476/2007 తేదీ 29/10/2007న 657/6 సర్వే నంబర్ లో ఒక ఎకరం భూమికి పట్టా పాసుబుక్ అందజేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు అదే నా జీవనాధారం. 2016 డిజిటలైజేషన్ ప్రక్రియలో ఆ సర్వే నంబర్‌పై మరొకరి పేరు నమోదు చేశా రు. అప్పటి నుంచి ఇప్పటి వరకు రైతుబంధు, బ్యాంకు రుణమాఫీలు, ప్రభుత్వం నుంచి పొందే పథకాలు నష్టపోయాను. ఇప్పటికైనా అధికా రులు సర్వే చేసి పాస్‌బుక్‌లో పేరు సరిచేయాలి. - గుండె చిన్న రాజన్న, సిర్గాపూర్

గ్రీవెన్స్‌కు ఎందుకు వచ్చారు



అంగన్వాడీ హెల్పర్లను ప్రశ్నిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: అంగన్‌వాడీ హెల్పర్స్ ప్రజాఫిర్యాదుల విభాగానికి రావడంపై కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత పద్ధతిలోనే ప్రమోషన్లు ఇవ్వాలని, పదోన్నతి వయసు 50 ఏళ్లకు పెంచాలని, పెండింగ్ వేతనాలు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో హెల్పర్లు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తు పెట్టుకున్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ విధులకు వెళ్లకుండా కలెక్టరేట్‌కు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజావాణికి వచ్చిన హెల్పర్లను సస్పెండ్ చేయాలని డీడబ్ల్యూవోను ఆదేశించారు.

న్యూట్రిషన్ కిట్లు అందుబాటులో ఉంచాలి



తెలంగాణ రాష్ట్రంలో గర్భిణులకు ఏడో నెలలో రాష్ట్ర ప్రభుత్వం న్యూట్రిషన్ కిట్లు అందించే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఖానాపూర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పరిధిలో మాత్రం అర్హులకు న్యూట్రిషన్ కిట్లు అందడం లేదు. సంబంధిత అధికారులు విచారణ జరిపి అర్హులందరికీ న్యూట్రిషన్ కిట్లు అందించాలి. - ఆలేపు పీటర్, ఖానాపూర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయిలో జిల్లా విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్‌టౌన్‌: రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు డీఈవో ప్రణీత, జిల్లా సైన్స్‌ అధికారి రఘురమణ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ శాస్త్ర సాంకేతిక మండలి పర్యావరణ పరిరక్షణ, పరిశోధన స్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సుస్థిర భవిష్యత్‌ కోసం సైన్స్‌ అనే అంశంపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కవిత్వంలో సెయింట్‌ జోసెఫ్‌ కాన్వెంట్‌ పాఠశాలకు చెందిన సమాయెరా ఫాతిమా, పాటల విభాగంలో జెడ్పీఎస్‌ఎస్‌ జైనథ్‌ పాఠశాలకు చెందిన ప్రవళిక, ఉపన్యాసం పోటీల్లో అదే పాఠశాలకు చెందిన హరిప్రియలు రాణించినట్లు పేర్కొన్నారు. సైన్స్‌ దినోత్సవం రోజున వరంగల్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

దొంగ అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: ఆదిలాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌లో ఈనెల 22న బ్యాగ్‌ చోరీకి పాల్పడిన కెరమెరి మండలం సుర్దాపూర్‌కు చెందిన సయ్యద్‌ ఫయ్యాజ్‌ను అరెస్టు చేసినట్లు టూటౌన్‌ సీఐ అశోక్‌ తెలిపారు. బోథ్‌కు చెందిన సరిత ఆదిలాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సు కోసం వేచి చూస్తోంది. ఈ క్రమంలో బస్సు రాగా సీట్‌ ఆపేందుకు బ్యాగ్‌ను అక్కడే వదిలేసి బస్సులోకి వెళ్లింది. తిరిగి చూసేసరికి బ్యాగ్‌ కనిపించకుండా పోయింది. దీంతో బాధితురాలు టూటౌన్‌లో ఫిర్యాదు చేసింది. సోమవారం పోలీసులు అనుమానంతో సయ్యద్‌ ఫయ్యాజ్‌ను విచారించగా విషయం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

ఇద్దరు ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్‌: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వన్‌టౌన్‌ సీఐ సత్యనారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్‌ జిల్లా తాంద్రకు చెందిన కాయిపాక రమేష్‌, కిన్వట్‌ తాలుకా కొటారికి చెందిన రఘునాథ్‌లు ఆదిలాబాద్‌ పట్టణంలో రెండు ద్విచక్ర వాహనాలను దొంగలించారు. మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్‌లో మరోసారి చోరీ చేసేందుకు జిల్లా కేంద్రానికి రాగా, సోమవారం తెలంగాణ చౌక్‌లో వాహనాల తనిఖీలు చేస్తున్న వన్‌టౌన్‌ ఎస్సై హబీబ్‌కు అనుమానం వచ్చి విచారించారు. ఈనెల 21న రిమ్స్‌ ఆస్పత్రి ఎదుట బైక్‌, శివాజీ చౌక్‌లో మరో ద్విచక్ర వాహనాన్ని చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. అదేవిధంగా వారి వద్ద ఉన్న వాహనాన్ని సైతం పూణె నుంచి దొంగలించినట్లు తెలిపారు. దీంతో వారిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

నీటి కోసం కాలినడకన వెళ్తున్న మహిళలు



గ్రామంలో ఏర్పాటు చేసిన సోలార్‌ విద్యుత్‌ సిస్టం



బిందెలతో నీళ్లు తీసుకెళ్తున్న మహిళలు



చెరువు నీరే దిక్కు...

అన్నీ ఉన్న అల్లుడి నోట్లో శని ఉందన్నట్లుగా మారింది ఏజెన్సీ ప్రాంతంలోని కొలాం గిరిజనుల పరిస్థితి. ఐటీడీఏ ఆధ్వర్యంలో కొలాం గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పీటీజీ పేరుతో ప్రత్యేక పథకాల ద్వారా కోట్లాది రూపాయలు విడుదల చేస్తున్నప్పటికీ వారి బతుకుల్లో మాత్రం మార్పు రావడం లేదు. 80ఏళ్లుగా ఏజెన్సీ ప్రాంతంలో కొలాం గిరిజనులకు కనీసం గుక్కెడు తాగునీరు సైతం దొరకని దుస్థితి. అలాగే వారి గూడాలకు వెళ్లేందుకు కానరాని రోడ్డు.. విద్యుత్‌ సౌకర్యం లేక దుర్భర జీవనం సాగిస్తున్నారు. నేటికీ వారి గూడాల్లో మౌలిక వసతులు కల్పించడంలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. – నార్నూర్‌

- బిందెడు నీటి కోసం నాలుగు కిలోమీటర్లు..
- భీంపూర్‌ బొజ్జు కొలాంగూడ దుస్థితి
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు

నాలుగు కిలో మీటర్లు నడవాల్సిందే...

నార్నూర్‌ మండలంలోని భీంపూర్‌ గ్రామపంచాయతీ పరిధిలోని బొజ్జు కొలాంగూడ గ్రామంలో దాదాపు 15కొలాం గిరిజన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేదు. బిందెడు నీటి కోసం దాదాపు నాలుగు కిలో మీటర్ల దూరంలోని చెరువు వద్దకు ఖాళీ బిందెలతో కాలినడకన వెళ్లాల్సిన దుస్థితి. చెరువులోని మురికి నీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నామని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ గ్రామానికి విద్యుత్‌ సౌకర్యం లేదు. మూడు నెలల క్రితం ఈ గ్రామంపై సాక్షిలో వార్తను ప్రచురించగా స్పందించిన అప్పటి ఐటీడీఏ పీవో చాహత్‌ బాజ్‌పాయి, అధికారులు సోలార్‌ సిస్టం ఏర్పాటు చేశారు. రెండు లక్షల రూపాయలతో నీటి సౌకర్యం కోసం బోర్‌వెల్‌ మంజూరు చేసినా అధికారులు విద్యుత్‌ సౌకర్యం కల్పించడం మర్చిపోయారు. దీంతో బోర్‌వెల్‌ వృథాగా మారింది. ప్రస్తుతం గ్రామస్తులు కొలాం గిరిజనులు నీటి కోసం తంటాలు పడుతున్నారు. అధికారులు స్పందించి బొజ్జు కొలాంగూడకు నీటి సౌకర్యంతో పాటు మెరుగైన సదుపాయాలు కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు.



చెరువులో మురికి నీటిని తోడుతున్న మహిళలు

చాలా కట్టంగా ఉంది



నీటి కోసం చాలా కష్టంగా ఉంది. బిందె నీటి కోసం నాలుగు కిలో మీటర్ల దూరం వెళ్తున్నాం. ఎండ ఎక్కువగా ఉండడంతో చెరువులో నీరు ఇంకి పోతోంది. నీటి కోసం చాలా కష్టంగా ఉంది. మురుగునీరు తాగుతుండడంతో రోగాలస్తున్నాయి. – లేతుబాయి, బొజ్జు కొలాంగూడ

కరెంట్‌ సౌలత్‌ లేదు



నీళ్ల కోసం బాగా గోస్సైతాది. రోజు రెండు పూటలు దూరం నుంచి నీటిని తీసుకొస్తున్నాం. పెద్ద సార్లు వచ్చిండ్రు. బోర్‌వేల్‌ వేసిండ్రు. కరెంటు సౌలత్‌ కల్పించలేదు. చాలా కట్టమైతంది. పెద్ద సార్లు మా వైపు చూడాలి. – సీడం భీంబాయి, బొజ్జుగూడ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..



టీడీఏ పీవో, ఈఈ ఆదేశాల మేరకు ఇప్పటికే నీటి సౌకర్యం కోసం దాదాపు రెండు లక్షలతో బోర్‌వేల్‌ వేయడం జరిగింది. కరెంట్‌ సౌకర్యం లేకపోవడంతో సోలార్‌ ఏర్పాటు చేశాం. బోర్‌వెల్‌కు విద్యుత్‌ సౌకర్యం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తా. – రాథోడ్‌ సునీల్‌, ఐటీడీఏ ఏఈ, ఉట్నూర్‌

తీరు మారలే... ప్లాస్టిక్‌ను వదలలే



పర్యావరణానికి, ఆరోగ్యానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ వాటర్‌ బాటిళ్ల వాడకాన్ని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో పూర్తిగా నిషేధిస్తున్నట్లు కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ ఇటీవల అధికారుల సమక్షంలో వెల్లడించారు. అధికారులేవరూ వాటిని వాడొద్దని ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలను అక్కడి సిబ్బంది విస్మరించినట్లున్నారు. సోమవారం జరిగిన ప్రజావాణిలో అధికారుల ముందు ప్లాస్టిక్‌ బాటిళ్లే దర్శనమివ్వడం అందుకు నిదర్శనం.
– సాక్షి ఫొటోగ్రాఫర్‌, ఆదిలాబాద్‌

దాహార్తి తీర్చాలని వేడుకున్నా పట్టించుకోలేదు

- తుడుం దెబ్బ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్‌

ఆదిలాబాద్‌రూరల్‌: మావల మండలంలోని బట్టిసావర్‌గాం శివారు ప్రాంతంలో కుమురంభీం కాలనీలో గుడిసేలు వేసుకుని నివాసముంటున్న ఆదివాసీ ప్రజల దాహార్తి తీర్చేందుకు బోరు బావులు వేయాలని పలుమార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా పట్టించుకోలేదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గోడం గణేష్‌ ఆరోపించారు. వేసవి సమీపిస్తున్న దృష్ట్యా కాలనీ ప్రజలు తాగు నీటికి ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉన్నందున ఇంటింటికీ చందాలు సేకరించి బోరు బావులు వేసుకుని చేతి పంపులు బిగించుకున్నారు. వాటిని సోమవారం తుడుం దెబ్బ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీసం చేతి పంపులు కూడా వేయడం లేదని గ్రహించి తుడుం దెబ్బ సౌజన్యంతో కాలనీలో చేతి పంపులు ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమ్ర శ్యాంరావ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్‌, రాష్ట్ర మహిళ కార్యదర్శి గోడం రేణుకా, జిల్లా ఉపాధ్యక్షురాలు ఉయిక ఇంద్ర, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్‌, మెస్రం తులసీరాం పటేల్‌, కుమ్ర గోవింద్‌రావ్‌, సెడ్మకి రాములు ఉన్నారు.



చేతి పంపును ప్రారంభిస్తున్న నాయకులు

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆదిలాబాద్‌టౌన్‌: వ్యవసాయ భూమి తనకు కౌలుకు ఇవ్వలేదని హత్య చేసిన కేసులో ఒకరికి జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి డాక్టర్‌ సీహెచ్‌ వీఆర్‌ఆర్‌ వరప్రసాద్‌ సోమవారం తీర్పునిచ్చినట్లు లైజన్‌ అధికారి గంగాసింగ్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. భీంపూర్‌ మండలం అర్లి(టి) గ్రామం శాంతినగర్‌కు చెందిన కుమ్ర భీంరావు, ఆత్రం అంకుష్‌లు బంధువులు. అంకుష్‌కు వ్యవసాయ భూమిని భీంరావు తనకు కౌలుకు ఇవ్వాలని కోరగా ఇవ్వకపోవడంతో పగ పెంచుకున్నాడు. 2023 జూలై 4న రాత్రి 7.30 గంటల ప్రాంతంలో అంకుష్‌ ఇంటి ఎదుట గొడవకు దిగాడు. దీంతో అంకుష్‌ను కత్తితో పొడిచి హత్య చేశాడు. చుట్టుపక్కల వారు అక్కడికి చేరుకోగా అంకుష్‌ను తానే చంపానని ఒప్పుకుని పారిపోయాడు. భీంపూర్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు నమోదు కాగా అప్పటి ఎస్సై రాధిక కేసు నమోదు చేశారు. పీపీ సంజయ్‌కుమార్‌ వైరాగ్రే 26మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువైంది. ఈ మేరకు జడ్జి తీర్పునిచ్చినట్లు వివరించారు.

కొనసాగుతున్న మల్లన్న జాతర

ముధోల్‌: మండలంలోని ఎడ్‌బిడ్‌ గ్రామంలో రెండు రోజులుగా సాగుతున్న మల్లన్న జాతరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల నుంచే కాకుండా వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటున్నారు. సోమవారం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మల్లన్న ఆలయ ప్రాంగణంలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుస్తీ పోటీల్లో నియోజకవర్గం నుంచే కాకుండా పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని ధర్మాబాద్‌, నాందెడ్‌, కొండలవాడి, నర్సి, పుసత్‌, తదితర గ్రామాల నుంచి కుస్తీ పోటీల్లో పాల్గొనేందుకు మల్లయోధులు తరలివచ్చారు. భక్తులందరికీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మహాన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోటీలను ఎమ్మెల్యే రామారావుపాటిల్‌ ప్రారంభించారు. గెలుపొందిన మల్లయోధుడికి ఎమ్మెల్యే మొదటి బహుమతి రూ.10వేలు, వెండి కడియం, రెండవ బహుమతి రూ.5వేలు, గ్రామ కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. సీఐ మల్లేష్‌, ఎస్సై సాయికిరణ్‌ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



కుస్తీ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

యూరియా కొరత లేకుండా చూడాలి

తలమడుగు: జిల్లాలో రబీ పంట సాగు చేస్తున్న రైతులకు యూరియా కొరత లేకుండా చూడాలని జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో సహకార సంఘాలు, రువుల షాపుల ద్వారా విక్రయిస్తున్న యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులు యూరియా కొనుగోలు సమయంలో ఆధార్‌ కార్డు తప్పనిసరి తీసుకోరావాలని కోరారు. తలమడుగు సహకార సంఘం ద్వారా యాసంగిలో రూ.4కోట్ల ఎరువులు విక్రయించడం ఎంతో అభినందనీయమని సీవో మోతే శ్రీనివాస్‌ను, సిబ్బందిని కొనియాడారు. అనంతరం సహకార సంఘం జిల్లా అధికారి మోహన్‌ మాట్లాడుతూ ఆర్థిక భారం తగ్గించేందుకు ఎరువుల విక్రయాలు పంటల కొనుగోలు చేపడుతున్నామన్నారు. మండల వ్యవసాయ అధికారి మహేందర్‌, సీఈవో శ్రీనివాస్‌, సెక్రటరీలు సాగర్‌, గంగయ్య, భీమ్‌రావు ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

ఇచ్చోడ: మండలంలోని రాణి జిన్నింగ్‌ ఫ్యాక్టరీ ఎదుట సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఉమాజీ జాదవ్‌ (33) మృతి చెందాడు. ఎస్సై నరేష్‌ తెలిపిన వివరాల ప్రకారం... చంద్రపూర్‌ జిల్లాకు చెందిన ఉమాజీ సమీప బంధువుల పెళ్లి పత్రికలు ఇచ్చేందుకు ఆదివారం నిర్మల్‌ జిల్లా సారంగపూర్‌ మండలంలోని నాఖతాండకు వచ్చాడు. సోమవారం ఉదయం బైక్‌పై బయలుదేరాడు. ఉదయం 9గంటల ప్రాంతంలో జాతీయ రహదారిపై వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉమాజీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బావమరిది శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.



ఉమాజి మృతదేహం

యువకుడి ఆత్మహత్య

కుంటాల: మండలంలోని అంబకంటి గ్రామానికి చెందిన పొన్నవేని చందు(31)ఆదివారం రాత్రి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్సై దేవ్‌రావు కథనం ప్రకారం... చందు భార్య అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఇటీవల ఆపరేషన్‌ చేయించాడు. ఆపరేషన్‌ కోసం చేసిన అప్పులు తీర్చలేక జీవితంపై విరక్తితో ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్యతో పాటు కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

ముగ్గురి రిమాండ్‌

బజార్‌హత్నూర్‌: మండలంలోని దిగ్నూర్‌ గ్రామంలో గిరజాబాయి, వారి కుటుంబ సభ్యులపై ఈ నెల 24న జరిగిన కత్తి దాడిలో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన చోలే నందకుమార్‌, కేంద్రే గంగాధర్‌, కేంద్రే వినాయక్‌లను సోమవారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో కేసు విచారణ చేపట్టి 24గంటల్లోనే నిందితులను పట్టుకుని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ కేసు ఛేదించిన వారిలో ఆదిలాబాద్‌ టూటౌన్‌ సీఐ అశోక్‌, రూరల్‌ సీఐ సైదారావ్‌, బజార్‌హత్నూర్‌, బోథ్‌ ఎస్సైలు నరేష్‌, రాము ఉన్నారు.

మరొకరి రిమాండ్‌

ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఉద్దవ్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్‌ సీఐ అశోక్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సుందరయ్యనగర్‌కు చెందిన ఉద్దవ్‌ మద్యానికి బానిసయ్యాడు. ఇద్దరు కుమారులు కూలీ పనిచేస్తుండగా వారి వద్ద నుంచి డబ్బులు తీసుకునేవాడు. ఈ క్రమంలో ఆదివారం గొడవపడి కేఆర్‌కే కాలనీలో అద్దెకు ఉంటానని వెళ్లిపోయాడు. సాయంత్రం తిరిగి వచ్చి డబ్బులు కావాలని మళ్లీ గొడవకు దిగాడు. కత్తితో తన కుమారులు సూర్యవంశీ శాంతికుమార్‌, ఆకాష్‌లపై దాడికి యత్నించాడు. దీంతో ఆకాష్‌ చేతికి గాయాలయ్యాయి. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

ఆర్టీసీకి కలిసొచ్చిన జాతర

- జిల్లాలో నడిచిన బస్సులు 342
- ఫిబ్రవరి 18 నుంచి 24వరకు రాకపోకలు
- భక్తులను చేరవేయడం ద్వారా రూ.3కోట్ల పైనే రాబడి
- మహా శివరాత్రిపై ప్రత్యేక దృష్టి



మంచిర్యాల బస్‌స్టేషన్‌లో బస్సులు

మంచిర్యాలఅర్బన్‌: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతర ఆర్టీసీకి కలిసొచ్చింది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు చెందిన ఆదిలాబాద్‌ రీజియన్‌లో అన్ని డిపోలకు చెందిన అధికార యంత్రాంగం అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంది. మేడారానికి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి బస్సులు నడిపించారు. మంచిర్యాల జిల్లా నుంచి మేడారం జాతరకు అత్యధికంగా భక్తులు వెళ్లడాన్ని గ్రహించిన ఆర్టీసీ యాజమాన్యం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకుంది. రీజినల్‌ మేనేజర్‌ సోలోమాన్‌ ఆయా డిపోల మేనేజర్లతో సమన్వయం చేసుకుంటూ ఆదాయాన్ని పెంచుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఊరటనిచ్చాయి. ఫిబ్రవరి 18 నుంచి 24వరకు జాతరకు మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు, మందమర్రి, శ్రీరాంపూర్‌లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఆయా డిపోల డీఎంలు పర్యవేక్షిస్తూ బస్సులు నడిపించారు. ఆదిలాబాద్‌ రీజియన్‌ నుంచి మొత్తం 342 బస్సులు నడిపి 72,108 మంది ప్రయాణికులను చేరవేశారు. తద్వారా రూ3,41,51,898 రాబడి వచ్చింది.

ప్రత్యేక బస్సులతో..

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సులు నడిపి అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. 342 బస్సులను 6,13,739 కిలోమీటర్ల మేర తిప్పారు. 59శాతం ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్‌) సాధించారు. 72,108 మంది భక్తులను గమ్యస్థానాలకు చేర్చారు. ఇందులో టికెట్‌ ధర చెల్లించిన ప్రయాణికులంటే మహలక్ష్మి ప్రయాణికులే ఎక్కువగా ఉన్నారు. టికెట్‌ ధర చెల్లించి ప్రయాణం చేసిన వారు 33,084 మంది కాగా 39,024 మంది మహలక్ష్మి ప్రయాణికులున్నారు. మంచిర్యాల డిపో నుంచి నడిపిన బస్సుల ద్వారా రూ.1,05,31,88 ఆదాయం సమకూరింది. ఆదిలాబాద్‌ డిపోకు చెందిన బస్సుల(చెన్నూర్‌ పాయింట్‌) ద్వారా 13,946 మంది ప్రయాణికులను, భైంసా డిపో బస్సుల(శ్రీరాంపూర్‌ పాయింట్‌) ద్వారా 16,692 మంది భక్తులను, నిర్మల్‌ డిపో బస్సుల(మందమర్రి పాయింట్‌) ద్వారా 9,471 మందిని, ఆసిఫాబాద్‌ డిపో బస్సుల (బెల్లంపల్లి, ఆసిఫాబాద్‌ పాయింట్లు) ద్వారా 7,321 మంది భక్తులు, మంచిర్యాల డిపో బస్సుల ద్వారా(మంచిర్యాల బాలుర ఉన్నత పాఠశాల మైదానం నుంచి) 24,678 మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు.

డిపో	బస్సులు	కిలోమీటర్లు	ఆదాయం(రూ.లలో)	'మహలక్ష్మి' ప్రయాణికులు	పెయిడ్‌ ప్రయాణికులు
ఆదిలాబాద్‌	65	1,24,405	67,99,504	7391	6555
భైంసా	40	72,509	41,72,312	9014	7678
నిర్మల్‌	58	86818	51,80,271	5020	4451
ఆసిఫాబాద్‌	72	1,36,321	74,67,923	4027	3294
మంచిర్యాల	107	191686	1,05,31,888	13573	11105

ఇక్కట్లు లేకుండా బస్సులు నడిపాం

మేడారం జాతర సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, అధికారులంతా సమన్వయంతో పనిచేశారు. జాతర వెళ్లే భక్తులకు ఎక్కడా ఇక్కట్లు ఎదురు కాకుండా చూశాం. మంచిర్యాల–మేడారం–మంచిర్యాలకు దాదాపు 72 వేల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశాం. మహాశివరాత్రి నేపథ్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రం నుంచి వేలాల, బుగ్గ, నిర్మల్‌ నుంచి వేములవాడకు ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధం అవుతున్నాం. రద్దీని బట్టీ ఆయా పుణ్యక్షేత్రాలకు బస్సులను నడిపించేందుకు చర్యలు చేపట్టాం. – సోలోమాన్‌రాజ్‌, రీజినల్‌ మేనేజర్‌ ఆదిలాబాద్‌

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఇచ్చోడ: ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఎస్సై నరేశ్‌ వివరాల ప్రకారం... మండలంలోని ధర్మంపురి గ్రామానికి చెందిన సోయం శంకర్‌ (31) కుటుంబ కలహాలతో ఆదివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారకస్థితిలో పడిపోయాడు. కుటుంబ సభ్యులు గమనించి 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతి చెందాడు. మృతుడి తల్లి సోయం మోతిబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు

- డీడీ దిలీప్‌కుమార్‌

ఉట్నూర్‌రూరల్‌: గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని డీడీ దిలీప్‌కుమార్‌ అన్నారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. తలమడుగు మండలం దుర్గాపూర్‌ గ్రామానికి చెందిన నైతం రమణ తనకు బోరుబావి ఇప్పించాలని, గుడిహత్నూర్‌ మండలం మన్నూర్‌ గ్రామానికి చెందిన కనక లాలురాం ఇల్లు మంజూరు చేయాలని, ఆదిలాబాద్‌ మండలం అంఖాపూర్‌ గ్రామానికి చెందిన సిడాం సచిన్‌ ఎడ్ల జత కావాలని, తలమడుగు మండలం లక్ష్మీపూర్‌ గ్రామానికి చెందిన తుకారాం జనరల్‌ స్టోర్‌ ఏర్పాటు చేయించాలని కోరాడు. అలాగే పలువురు పింఛన్‌, రెండు పడకల గదుల ఇల్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలంటూ దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డీడీ సూచించారు. ప్రజావాణిలో ఏపీవో కనకరరావు, ఏడీఎంహెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్‌, పీహెచ్‌వో సందీప్‌ ఉన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్‌